# 3

# ధర్మశాస్త్రం క్రింద ఆరాధన, 1

## (మోషేనుండి సొలొమోనువరకు)

ఐగుప్తు బానిసత్వంనుండి దేవుడు ఇశ్రాయేలీయులను వెలుపలికి రప్పించినప్పుడు, వారు ఆయనకు ప్రత్యేకమైన జనులని, ఆయన వారికి దేవుడైయుంటానని వాగ్దానం చేశాడు (నిర్గమకాండము 6:7). సీనాయి పర్వతమునొద్ద ఆయన వారితో నిబంధన చేసి, తన ధర్మశాస్త్రాన్ని వారికిచ్చాడు.

### ఆరాధనా చట్టములు

ధర్మశాస్త్రమునకు పూర్వం ఉన్న జంతు బలులవంటి ఆచారాలను ధర్మశాస్త్రంలో చేర్చినా, ధర్మశాస్త్రం క్రింద ఆరాధన ఎక్కువ క్రమబద్ధంగా చేయబడింది. ఇశ్రాయేలు సమాజ కూడికలలో పాటలు పాడుటగాని, ప్రార్థనలుగాని చేర్చినట్టు చెప్పలేదు, కాని ప్రతి ఏడవ సంవత్సరం పర్ణశాలల పండుగ సమయంలో సమాజానికి ధర్మశాస్త్రం చదివి వినిపించాలి (ద్వితీయోపదేశకాండము 31:10-13). తమ యిండ్లలోను, మార్గమున నడుచునప్పుడును పిల్లలకు దేవుని వాక్యము నేర్పించాలని తలిదండ్రులు ఆదేశింపబడ్డారు (ద్వితీయోపదేశకాండము 6:6, 7).

మోషే ద్వారా దేవుడు బయలుపర్చిన ఆరాధన యొక్క మంచి సంగ్రహము ఈ క్రింద యివ్వబడింది:

> (1) ప్రార్థనలు, అర్పణలు, ఉత్సవములవంటివి, ప్రతిదియు నిర్దేశించబడింది. (2) ముఖ్యముగా, బలి అర్పణ విధానం చుట్టు ఆరాధన నిర్మించబడింది. అందులోని రక్తం ప్రజల ప్రాణంకొరకు సూచనగా ఉంది. (3) హెబ్రీ సంవత్సరమునకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వబడింది. (4) ఈ విధానంలో యాజకుడు బలి అర్పణలను ప్రదర్శించినందున ముఖ్యమైన పాత్రను నిర్వహించాడు. (5) దేవుని ప్రసన్నత గురుతుగా చూపబడి ఆరాధన స్థలము ప్రాధాన్యతను పొందింది. (6) ప్రత్యేకించి పస్కా, పెంతెకొస్తు, శృంగనాదము, పాపపరిహార దినము మరియు పర్ణశాలల పండుగలకు అధికమైన ప్రాముఖ్యత కలదు.[1]

సబ్బాతు దినము ఆరాధనకు ప్రత్యేక దినము కాదు, కాని అది విశ్రాంతి దినము. వారములో ప్రతి ఏడవ దినమున ఇశ్రాయేలు పని చేయడం మాని, ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించిన దేవుని విడుదలను వారు జ్ఞాపకం చేసికోవాలి (ద్వితీయోపదేశకాండము 5:12-15).

## ఆరాధనకు పాత్రమైనది

దేవుడు తన మహా ఘనతగల మహత్తరమైన విస్మయం కలిగించే స్వభావంచేత ఇశ్రాయేలును నడిపించుటకు మోషేను సిద్ధపరచి, ఒప్పించాడు. బానిసత్వమునుండి ఇశ్రాయేలు విడుదలను వెదక అతనిని ఐగుప్తునకు పంపక ముందు మండుతున్న పొదలో దేవుడు అతనికి ప్రత్యక్షమయ్యాడు. దేవుడు తన్ను తాను YEHWEH "ఉన్నవాడను" అని బయలుపరచుకొన్నాడు (నిర్గమకాండము 3:14). దానినుండి Yahweh అనే దేవుని నామము తీయబడింది – నిత్యుడగువాడు, తనకు తానే అయ్యున్నవాడు, సమస్తమునకు చాలినవాడు, ఎవరిమీద ఆధారపడనివాడు. ఆయన యిచ్చువాడు, ఎవడును ఆయనకు యివ్వవలసిన అవసరత లేనివాడు; ఆయన సహాయము చేయువాడు, ఆయనకు ఎవరును సహాయము చేయనవసరత లేనివాడు; ఆయన విడిపించువాడు, ఆయనను ఎవరును విడిపించ అవసరం లేనివాడు; సర్వము నెరిగినవాడు, తనకు ఎవరును నేర్పింపనవసరము లేనివాడు; సర్వశక్తుడు, ఎవడును ఆయనకు శక్తినివ్వనవసరము లేనివాడు. ఆయన పవిత్ర నామమును ఇశ్రాయేలీయులు గౌరవించాలి, ఘనపరచాలి.

దేవుడు తన సృష్టికి అతీతుడును స్వభావములో భౌతికమైనవాడు కానందున, తనకు ప్రతినిధిగా ఏ రూపమును చేసికోకూడదు, వారట్టి రూపాలను ఆరాధింపను కూడదు (నిర్గమకాండము 20:3–5; ద్వితీయోపదేశకాండము 5:7–9). మోషే యిలా అన్నాడు,

> హోరేబులో యెహోవా అగ్నిజ్వాలల మధ్యనుండి మీతో మాటలాడిన దినమున మీరు ఏ స్వరూపమును చూడలేదు. కావున మీరు చెడిపోయి భూమిమీదనున్న యే జంతువు ప్రతిమనైనను ఆకాశమందు ఎగురు రెక్కలుగల యే పక్షి ప్రతిమనైనను నేలమీద ప్రాకు ఏ పురుగు ప్రతిమనైనను భూమిక్రిందనున్న నీళ్లయందలి యే చేప ప్రతిమనైనను ఆడు ప్రతిమను గాని మగ ప్రతిమనుగాని, యే స్వరూపము గలిగిన విగ్రహమును మీకొరకు చేసికొనకుండునట్లును, ఆకాశమువైపు కన్నులెత్తి సూర్య చంద్ర నక్షత్రములైన ఆకాశ సైన్యమును చూచి మరలుకొల్పబడి, నీ దేవుడైన యెహోవా సర్వాకాశము క్రిందనున్న సమస్త ప్రజలకొరకు పంచిపెట్టినవాటికి నమస్కరించి వాటిని పూజింపకుండునట్లును మీరు బహు జాగ్రత్తపడుడి (ద్వితీయోపదేశకాండము 4:15–19).

మరియ యొక్క మానవత్వాన్ని ప్రదర్శించుటకు ఆరాధకుడు ఉపయోగించే ప్రతిమలు, విగ్రహాలు మరియు యేసు మానవ శరీరంలో జీవించిన పలు దృశ్యాలను చిత్రించినవి పై ఉపదేశాన్ని ఉల్లంఘించాయి. ఆలాటి ప్రతిమలకు, విగ్రహాలకు సాగిలపడి ఘనపరచువారు మానవ రూపాన్ని ఆరాధిస్తున్నారు. ఇది ఖండితముగా నిషేధించబడింది. యేసు మహిమపరచబడిన తన ఆత్మ స్వరూపానికి తిరిగి వెళ్లారు (యోహాను 17:5; ఫిలిప్పీయులకు 3:21), కనుక ఆయన మానవ దేహంలో ఏ మాత్రమును లేరు. మనం యేసు యొక్క దైవిక స్వభావాన్నే ఆరాధించాలి. శరీరధారియైయుండిన ఆయన మానవ స్వరూపాన్ని ఆరాధించ కూడదు.

ధర్మశాస్త్రం క్రింద దేవుడు మాత్రమే ఆరాధింపబడాలి (ద్వితీయోపదేశకాండము 6:14, 15). ఏదియు వారి స్వయిష్టానికి విడిచిపెట్టకుండ ఇశ్రాయేలు ఆరాధనలో ఏమి అర్పించవలెనో దానికి సంబంధించిన ప్రతి దానిని ప్రత్యేకించి ఆయన ఆదేశించాడు.

ఆయన చిత్త ప్రకారము వారు ఆరాధించాలి, ఆయన సూచించిన స్థలంలో ఆయన కోరిన విధానంలో వారు చేయవలసియున్నారు.

> ఆరాధన యొక్క రూపాలు లేక పద్ధతులలో ప్రత్యేకించి చెప్పబడిన జంతువుల రకాలు ధాన్యపు అర్పణలు బలులు (దహన, నైవేద్య, సమాధాన, పాప, మరియు లేవీయ కాండము 1-7లోని దోషపు అర్పణలు), మతాచార శుద్ధీకరణ (ద్వితీయోపదేశ కాండము 21:6), ప్రార్థన (నిర్గమకాండము 30:7-10), దేవుని వాక్యపు ఉపదేశము మరియు కంఠస్థం (లేవీయకాండము 10:11; ద్వితీయోపదేశకాండము 6:4-9), మరియు దశమ భాగములు, యెహోవాకు అర్పణలు (సంఖ్యాకాండము 18:21-24). గుడారము లేక ప్రత్యక్ష గుడారము మరియు యాజకత్వం అనేవి హెబ్రీ ఆరాధనలో దేవునిచే విధింపబడినవి (నిర్గమకాండము 29:1-9; 35:1-19).[2]

## ఆరాధనా స్థలం

ధర్మశాస్త్రం క్రింద ఆరాధన ప్రత్యక్ష గుడారము మరియు తరువాత దేవాలయంతో సంబంధం కలిగియుంది. దేవాలయం ప్రత్యక్ష గుడారానికి రెండంతల పరిమాణంలో ఉంది. అది రెండు భాగాలుగా విభాగింపబడింది. సముఖపు రొట్టెల బల్ల,[3] ధూపపు బలిపీఠం, బంగారు దీపస్తంభము "పరిశుద్ధ స్థలంలో" ఉన్నాయి. దేవుడు వాగ్దానం చేసిన ప్రసన్నతను కనుపరచే నిబంధన మందసం "అతిపరిశుద్ధ స్థలంలో" ఉంది. పది ఆజ్ఞలు గల నిబంధన పలకలు నిబంధన మందసంలో ఉంచబడ్డాయి (ద్వితీయోపదేశ కాండము 10:4, 5; 1 రాజులు 8:9, 21).

ప్రత్యక్ష గుడారము మొదటిగా సీనాయి వద్ద ఏర్పాటు చేయబడింది (నిర్గమకాండము 40:2, 17; సంఖ్యాకాండము 10:11, 12). అరణ్య ప్రయాణ కాలంలో, ఇశ్రాయేలు వెళ్లిన ప్రతి చోటికి అది మోసికొని పోబడింది. ఇశ్రాయేలు విడిచిన గిల్గాలుకు అది తేబడినట్టు యెహోషువ తలంచాడు (యెహోషువ 4:19), అటు తరువాత ఏబాలు పర్వత సమీప స్థలానికి తేబడింది (యెహోషువ 8:30-35). న్యాయాధిపతుల కాలంలో, ఎఫ్రాయీములోని షిలోహుకు తరలించబడి, సౌలు ఏలుబడి కాలంవరకు అక్కడనే అది ఉంచబడింది. అది నెబోకు కొనిపోబడినట్టు కొందరు తీర్మానించారు, ఎందుకంటే - యాజకులు అక్కడ నివసించారు (1 సమూయేలు 22:11), అటు తరువాత గిబియోనుకు (1 దినవృత్తాంతములు 16:39) తరలించబడింది.

ఇశ్రాయేలు ఎక్కడ ఆరాధించాలో ధర్మశాస్త్రం ప్రత్యేకించి చెప్పలేదు, కాని దేవుడు కోరుకునే స్థలంలో జనులు యెహోవాను వెదకాలని మాత్రం తెలిపింది. "మీ దేవుడైన యెహోవా మీ సమస్త గోత్రములలో తన నామమును స్థాపించుకొనుటకు నివాస స్థానముగా ఏర్పరచుకొను స్థలమును వెదకి అక్కడికే యాత్రలు చేయుచుండవలెను" (ద్వితీయోపదేశకాండము 12:5). విగ్రహములను ఆరాధించు జనులు ఆరాధించు స్థలములలో వారు ఆరాధించకుండునట్లు దేవుడు ఇశ్రాయేలు కొరకు ఒక ప్రత్యేకమైన స్థలాన్ని కోరుకున్నాడు (ద్వితీయోపదేశకాండము 12:2-4). తాను కోరుకొనిన చోట వారు తన్ను ఆరాధించాలని ఆయన అనేక పర్యాయములు తెలిపాడు (ద్వితీయోపదేశ

కాండము 12:11-26; 14:23-25; 15:20; 16:2-16; 23:16; 26:2).

అరణ్య ప్రయాణపు 40 సంవత్సరాల కాలంలోను, న్యాయాధిపతులచే 400 సంవత్సరాలకు పైగా ఏలుబడి జరిగిన తరువాత (అపొస్తలుల కార్యములు 13:20), ఇశ్రాయేలు అనేక చోట్ల ఆరాధించారు. చివరిగా, దావీదు ఏలుబడి కాలంలో, నిబంధన మందసానికి నివాస స్థలంగా యెరూషలేము చేయబడింది (2 సమూయేలు 6:16, 17) అది ఇశ్రాయేలు ఆరాధనా స్థలంగా స్థిరపరచబడింది. సొలొమోను దేవాలయాన్ని పూర్తి చేసిన పిమ్మట మందసము అందులో ఉంచబడింది. దేవుని నామం గల పట్టణమని సొలొమోను చెప్పాడు (1 రాజులు 8:29, 44, 48), మరియు యెరూషలేములోని దేవాలయంలో ఇశ్రాయేలు తమ ప్రార్థనలు, విజ్ఞాపనలు చేసికోవాలని సొలొమోను అన్నాడు (1 రాజులు 8:33). దేవాలయానికి పయనించలేని దూరంలో నివసించే జనులు దేవాలయం తట్టు తిరిగి ప్రార్థించవలసి ఉంటుంది (1 రాజులు 8:38, 42, 44, 48).

ఇశ్రాయేలు ఆరాధనా స్థలమైన దేవాలయం క్రీ.పూ. 586 నాశనం చేయబడిన తరువాత యూదులు సమాజ మందిరాలను పెంపొందించుకున్నారు. జనులు కూడివచ్చి లేఖనాలు చదివి వాటికి అర్థం చెప్పుకొనడానికి ఈ సమాజ మందిరాలు నిర్దేశించబడ్డాయి. సమాజ మందిరాల్లో కూడి వచ్చేది సాధారణంగా ఈ క్రింది విషయాల కొరకు:

> (1) లేఖనాలు చదివి వాటికి అర్థం చెప్పడానికి; (2) యూదుల పారంపర్యమైన షెమాను కంఠస్థం చేయడానికి (ద్వితీయోపదేశకాండము 6:4); (3) కీర్తనలు, పది ఆజ్ఞలు, దీవెన, మరియు ఆమేన్ ఉపయోగించడం; (4) ప్రార్థనలు; మరియు (5) యూదుల కెడుషా, లేక పరిశుద్ధపరచు ప్రార్థన, *trisagion* ("పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు") అనేవి క్రైస్తవ పారంపర్యంగా మారాయి.[4]

## సంగ్రహం

ధర్మశాస్త్రం క్రింద దేవుడు బయలుపరచిన ఆరాధన బలులు, అర్పణలతో కూడింది. అహరోను సంతతివారైన యాజకులు వాటిని అర్పించవలసియుండింది. లేవీయులు ప్రత్యక్ష గుడారానికి సంబంధించిన పనిని జరిగించారు. ప్రత్యక్ష గుడారం చుట్టు ఇశ్రాయేలు ఆరాధన కట్టబడింది, తరువాత యెరూషలేము దేవాలయం ఆరాధనకు కేంద్ర స్థలంగా మారిపోయింది.

---

సూచనలు

[1]Franklin M. Segler, *Understanding, Preparing for, and Practicing Christian Worship*, 2d ed., rev. Randall Bradley (Nashville: Broadman and Holman, 1996), 23. [2]Andrew E. Hill, *Enter His Courts with Praise!* (Grand Rapids, Mich.: Baker Book House, 1993), 37. [3]The NASB లో "బల్లపై సన్నిధి రొట్టె" అని నిర్గమకాండము 25:30లో ఉంది. [4]W. O. E. Oesterley, "Pre-Christian Elements," *The Jewish Background of the Christian Liturgy* (Oxford: Clarendon Press, 1925), 36-82, cited in Segler, 23.